



షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152


# వెలుగు


ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక






సంపుటి : 2 సంచిక : 248 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 10 ఆగస్టు 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 248 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 010 August 2025 PAGES : 8 PRICE : 3/-


# ఇది దేవుడు సృష్టించిన అద్భుతం...



## మళ్లీ జన్మంటూ ఉంటే ఇక్కడే పుడతా

- గిరిజనుల ఉద్యోగ రిజర్వేషన్లపై జీవో 3ను పునరుద్ధరిస్తామని కీలక ప్రకటన
- ఏజెన్సీలో రోడ్లు, తాగునీటి కోసం వేల కోట్ల నిధులు మంజూరు
- గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు నిర్ణయం
- గత ప్రభుత్వ వైఫల్యం వల్లే జీవో 3 రద్దయిందని విమర్శ
- అరకు కాఫీ, పసుపు వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పిస్తామని వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 09)

గిరిజనుల అభివృద్ధి రాష్ట్ర సమగ్ర వికాసానికి కీలకమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని లగిశపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారీ ప్యాకేజీ -మిగతా 2లో

## రష్యాతో బంధం మరింత బలోపేతం

### మోదీ-పుతిన్ నిర్ణయం..
### ఇరువురు నేతల ఫోన్ సంభాషణ
### అమెరికా సుంకాల మోత వేళ కీలక పరిణామం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 09)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడుతున్న వేళ...రష్యాతో స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ అడుగులువేస్తోంది. భారత ప్రధాని మోదీ శుక్రవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక బంధం బలోపేతంతో పాటు పెట్టుబడులు, వాణిజ్యం, ఆర్థిక విషయాలపై చర్చించుకున్నారని ఢిల్లీ, మాస్కోల నుంచి విడివిడిగా విడుదలైన అధికారిక ప్రకటనలు తెలిపాయి. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో వారు తమ నిబద్ధతను చాటుకున్నట్లు తెలిసింది. ఉక్రెయిన్‌తో ఘర్షణ తాజా పరిస్థితిని పుతిన్ వివరించగా శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న తన సూచనను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 'మిత్రుడు పుతిన్‌తో ఫలప్రదమైన సంభాషణ కొనసాగింది. పలు అంశాలపై వివరంగా మాట్లాడుకున్నాం. ఉక్రెయిన్ తాజా పరిణామాలు వివరించినందుకు కృతజ్ఞతలు' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా ప్రధాని మోదీ తెలియజేశారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని సమీక్షించామన్నారు. ఈ ఏడాది చివర్లో భారత్ పర్యటనకు వచ్చే పుతిన్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నట్లు రాసుకొచ్చారు. పుతిన్ భారత్ పర్యటన తేదీలపై కసరత్తు చేస్తున్నట్లు మాస్కో పర్యటనలో ఉన్న జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ వెల్లడించారు. -మిగతా 2లో

## నాతో ఏ సంబంధం లేకపోయినా...

### రాఖీ పండుగ రోజున షర్మిల భావోద్వేగం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 09)



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్ అని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల అన్నారు. రాష్ట్రంలోని ప్రతి అన్నకు, ప్రతి తమ్ముడికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని బంధాలకన్నా రక్త సంబంధం గొప్పదని... తనతో -మిగతా 2లో

## టీడీపీకి పట్టం కట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారు

### పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ విజయం సాధిస్తుందన్న పార్థసారథి
### గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పట్ల విజన్ కనిపించలేదని విమర్శ
### పులివెందులలో చెరువులు కూడా నింపలేకపోయారని ఎద్దేవా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 09)

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని మంత్రి పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. పులివెందుల ప్రజల నుంచి టీడీపీకి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. వైసీపీ హయాంలో అంతులేని అవినీతి, అక్రమాలు జరిగాయని... దీంతో పులివెందుల ప్రజలు టీడీపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పట్ల విజన్ కనిపించలేదని... బటన్ నొక్కాం, పని అయిపోయింది అనుకున్నారని పార్థసారథి ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఇచ్చామని చెప్పి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించలేదని విమర్శించారు. జగన్ తన -మిగతా 2లో

## భారత రక్షణ రంగ ఉత్పత్తులుట రూ.1.51 లక్షల కోట్లు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 09)

దేశీయంగా రక్షణ ఉత్పత్తులు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల విలువ రూ. 1,50,590 కోట్లకు చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే -మిగతా 2లో

## సోదరి లేని నాకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు: నారా లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 09)

అందరి ఆశీస్సులతో మంగళగిరిని నంబర్ 1గా తీర్చిదిద్దుతానని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని అన్నారు. ఉండవల్లి నివాసంలో మంత్రికి మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. "మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200




అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం" అని పేర్కొన్నారు.

## పాక్‌కు చెందిన 5 యుద్ధ విమానాలు కూల్చేశాం

### ఆపరేషన్ సిందూర్‌పై ఐఏఎఫ్ చీఫ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 09)

పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కు భారత్ గట్టి దెబ్బకొట్టింది. మన సైన్యం జరిపిన మెరుపుదాడులతో శత్రు సేనల స్థావరాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ



ఆపరేషన్‌పై తాజాగా వాయు సేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. 'సిందూర్ ' సమయంలో పాక్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను మన సైన్యం కూల్చేసినట్లు తెలిపారు. దాయాది వాయుసేన సామర్థ్యానికి జరిగిన నష్టంపై భారత్ ప్రకటన చేయడం ఇదే తొలిసారి. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ -మిగతా 2లో

## భారత్ ఓపిక పడితే.. ట్రంప్ పేకమేడ కూలడం ఖాయం

### అమెరికన్ ఆర్థికవేత్త

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 09)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌పై స్వదేశంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. సుంకాల పేరుతో ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని



దుయ్యబట్టారు. అప్పటివరకు భారత్ ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. జాతీయమీడియా సంస్థ ఎన్డీటీవీతో మాట్లాడిన స్టీవ్ హాంకీ.. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల ) అంశాన్ని ప్రస్తావించారు. "సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితం. ఇక్కడో విషయం చెప్పాలి. 'తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే -మిగతా 2లో

## చొరబాటుదారులు కాంగ్రెస్-ఆర్జేడీ ఓటర్లు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 09)

బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులే ప్రతిపక్ష కాంగ్రెస్-ఆర్జేడీ కూటమికి ఓటుబ్యాంకు అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ఆరోపించారు. చొరబాటుదారులతో కూడుకున్న ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆయన సీతామఢీలో జరిగిన ఒక ర్యాలీని ఉద్దేశించి పేర్కొన్నారు. "ఓటరు జాబితా ముమ్మర సవరణ గతంలో అనేక పర్యాయాలు జరిగింది. కానీ రాహుల్ గాంధీ కానీ ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కానీ దాన్ని విమర్శించలేదు. తమ ఓటు బ్యాంకును రక్షించుకోడానికే వారు ఇప్పుడు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నారు" అని హోం మంత్రి అన్నారు. స్థానికుల ఉద్యోగాలను హరిస్తున్న అక్రమ ఓటర్లను రాహుల్‌గాంధీ, లాలూ ప్రసాద్ (యాదవ్)లు రక్షించాలని చూస్తున్నట్టు ఆయన ఆరోపించారు.

రామాయణ కాలంలో జనక మహారాజు సీతను కనుగొన్న ప్రదేశంగా భక్తులు విశ్వసించే "పునౌరా ధామ్" అభివృద్ధికి రూ. 882.87 కోట్లతో చేపట్టిన పనులకు అమిత్‌షా ఈ సందర్భంగా -మిగతా 2లో

# వైసిపి స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా కొర్రపోలు చక్రపాల్ నియామకం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 9)

యర్రగొండపాలెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా కొర్రపోలు చక్రపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకాన్ని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా చక్రపాల్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రతిపక్షంగా నిలిచి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తాను. నాయకత్వం ఇస్తున్న బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ, పార్టీ సిద్ధాంతాలు, దిశానిర్దేశం మేరకు నిస్వార్ధంగా పనిచేస్తాను. ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. తన మీద నమ్మకం పెట్టి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పేకాటరాయుళ్లపై పోలీసుల పంజా

**ఆరుగురు అరెస్ట్ రూ.68,200 నగదు స్వాధీనం**

**చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు**

**ఎస్ నరసింహారావు**



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 9)

కంభం పట్టణంలోని ఓ లాడ్జిలో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని స్థానిక ఎస్ఐ నరసింహారావు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.68,200 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెల్లడించారు. పేకాట ఆడుతున్న వారిని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి వారిపై కేసు నమోదు చేశామని పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకి తెలియజేయాలని వివరాలు అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# 108 అంబులెన్స్‌లో డెలివరీ తల్లి బిడ్డ క్షేమం




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 9)

పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ఓ మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని చెరువుకొమ్మిపాలెం గ్రామానికి చెందిన కనపర్తి కవిత కి శనివారం మధ్యాహ్నం పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే వాళ్ళ కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు ఫోన్ చేశారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది కవితని ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాటు చేశారు. అయితే ఆస్పత్రికి వెళ్లే సమయంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది అంబులెన్స్ ను పక్కకు నిలిపి డెలివరీ చేశారు. దీంతో కవిత కాన్పులో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు సరైన సమయంలో వచ్చి ఆదుకున్న 108 సిబ్బందినీ పైలెట్ నాగరాజు కు మెడికల్ సిబ్బంది రవితేజకు కుటుంభ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 108 జిల్లా మేనేజర్ విజయ్ కుమార్, కనిగిరి డివిజన్ సూపర్వైజర్ మహేష్ అభినందించారు.

**మొదటి పేజీ తరువాయి**

# ఇది దేవుడు సృష్టించిన అద్భుతం...

ప్రకటించారు. ఏజెన్సీ సమగ్రాభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పాడేరులో జరిగిన సభలో ప్రసంగించిన ఆయన, గిరిజనుల చిరకాల ఆకాంక్ష అయిన ఉపాధ్యాయ ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్ 3ను పునరుద్ధరించే బాధ్యత తనదేనని ఉద్ఘాటించారు.

ఏజెన్సీ ప్రాంతాలను దేవుడు సృష్టించిన అద్భుతంగా అభివర్ణించిన చంద్రబాబు, ఇక్కడి స్వచ్ఛమైన కొండలు, సహజసిద్ధమైన ప్రజల మనస్తత్వం తనను ఆకర్షించాయని తెలిపారు. "మళ్లీ జన్మ ఉంటే ఈ ఏజెన్సీలోనే పుట్టాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. గిరిజనుల సహజ నైపుణ్యం, సామర్థ్యాలను ప్రశంసిస్తూ, వారి అభివృద్ధి ద్వారానే రాష్ట్రం సంపూర్ణ వికాసం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మొదటి నుంచి ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఎన్టీఆర్‌ను గుర్తు చేస్తూ, ఆ దిశగా తమ ప్రభుత్వం కృషి కొనసాగిస్తుందని చంద్రబాబు తెలిపారు.

ఏజెన్సీలోని 1,483 గిరిజన గూడేలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ. 2,850 కోట్లు మంజూరు చేస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీరు అందిస్తామని, దీని కోసం రూ. 220 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ. 482 కోట్ల వ్యయంతో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం ఐటీడీఏల పరిధిలోనూ ఆసుపత్రులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

జీవో నంబర్ 3 రద్దు కావడానికి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని చంద్రబాబు ఆరోపించారు. తమ హయాంలో గిరిజన యువతకు న్యాయం చేసేందుకు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆధారంగా జీవో తెచ్చామని, కానీ గత ప్రభుత్వం కోర్టులో సరిగ్గా వాదనలు వినిపించలేకపోయిందని విమర్శించారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా ఈ జీవోను పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఏజెన్సీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. కాఫీ, మిరియాలు, పసుపు వంటి ఆర్గానిక్ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర లభించేలా చూస్తామన్నారు. వెదురు ఉత్పత్తుల ద్వారా 5 వేల మంది గిరిజన మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. టూరిజం హబ్స్‌గా ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్ల వంటివని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు.

## నాతో ఏ సంబంధం లేకపోయినా...

రక్త సంబంధం లేకపోయినా... వైఎస్సార్ అనే మూడక్షరాల అనుబంధాన్ని సంబంధంగా ఏర్పరుచుకుని తనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ప్రతి అన్న, ప్రతి తమ్ముడు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో సుఖంగా ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు.

## టీడీపీకి పట్టం కట్టేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారు

సొంత నియోజకవర్గం పులివెందులలో కూడా చెరువులు నింపలేకపోయారని ఎద్దేవా చేశారు. పులివెందులలో గృహ నిర్మాణం కూడా దారుణంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాయలసీమలో స్టీల్ ప్లాంట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని చెప్పారు.

## భారత రక్షణ రంగ ఉత్పత్తులుట రూ.1.51 లక్షల కోట్లు

18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైందని చెప్పారు.

"2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1.5లక్షల కోట్లకు చేరుకొని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. గతేడాది 1.27లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 2019-20లో రూ. 79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది" అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. డీఆర్‌డీవో, రక్షణ రంగ విభాగాలు సహా అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందన్నారు.

మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ)తో పాటు ఇతర పీఎస్‌యూలు 77శాతం తయారు చేయగా, మరో 33శాతంలో ప్రైవేటు రంగం పాత్ర ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని మన దేశం తగ్గించుకొని, ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యం కూడా భారీగా పెరిగిందన్నారు.

## పాక్‌కు చెందిన 5 యుద్ధ విమానాలు కూల్చేశాం

మార్షల్ ఏపీ సింగ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను పంచుకున్నారు. "పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాం. అది చాలా హై-టెక్ యుద్ధం. కేవలం 80-90 గంటల్లోనే మా లక్ష్యాల్లో చాలావరకు సాధించాం. యుద్ధం ఇలాగే కొనసాగితే.. భారీ మూల్యం తప్పదని వారికి (పాక్) అర్థమైంది. అందుకే కాళ్ల బేరానికి వచ్చారు. చర్చలు జరుపుదామని సందేశమిచ్చారు. మేం దానికి అంగీకరించాం" అని ఏపీ సింగ్ తెలిపారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన కనీసం ఐదు యుద్ధ విమానాలను కూల్చేశాం. మరో పెద్ద విమానాన్ని కూడా ధ్వంసం చేశాం. మన సైన్యం దాడి చేసిన పాక్ ప్రధాన ఎయిర్‌ఫీల్డ్‌లలో షహబాజ్ జకోబాబాద్ స్థావరం ఒకటి. అక్కడ ఎఫ్-16 హ్యాంగర్ ఉంది. మన సైన్యం దాడితో అది సగానికి పైగా దెబ్బతింది. అక్కడ కొన్ని యుద్ధ విమానాలు ఉన్నాయని, అవి తీవ్రంగా దెబ్బతిన్నాయని మేం అంచనాకు వచ్చాం. ఆపరేషన్ సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ, ఎస్-400 క్షిపణి వ్యవస్థ సమర్థంగా పనిచేశాయి" అని ఎయిర్ చీఫ్ మార్షల్ వివరించారు.

## భారత్ ఓపిక పడితే.. ట్రంప్ పేకమేడ కూలడం ఖాయం

మంచిద'నేది నెపోలియన్ మాట. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోంది. భారత్ విషయానికొస్తే.. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలి. ఎందుకంటే ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని ఆ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే తమ దేశ ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హాంకీ అంచనా వేశారు. టారిఫ్‌లపై ట్రంప్ విధానాలు చాలా చెత్తగా ఉన్నాయని దుయ్యబట్టారు. దీనివల్ల తమ ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

ట్రంప్‌తో ఎలా డీల్ చేయాలో మోదీకి చెబుతా

రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను ట్రంప్ రెట్టింపు చేసి 50శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల విషయం తేలేవరకు న్యూదిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చిచెప్పారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది అన్యాయమైన, అసమంజసమైన చర్య అని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని న్యూదిల్లీ స్పష్టం చేసింది.

## చొరబాటుదారులు కాంగ్రెస్-ఆర్జేడీ ఓటర్లు

శంకుస్థాపన చేశారు. భూమిపూజ అనంతరం అమిత్‌షా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో రూ. 137 కోట్లు పాత ఆలయ పునరుద్ధరణకు, మిగిలిన మొత్తం పర్యాటక సదుపాయాల అభివృద్ధికి వెచ్చిస్తామని అధికారి ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా అమిత్‌షా సీతామఢీ - దిల్లీ అమృత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు.

## రష్యాతో బంధం మరింత బలోపేతం

జిన్‌పింగ్, పుతిన్ సంభాషణ ఉక్రెయిన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఉక్రెయిన్ సంక్షోభం తాజా పరిస్థితిని వివరించడంతో పాటు ఇటీవల ఇదే అంశంపై అమెరికాతో కొనసాగిన సంప్రదింపుల వివరాలను జిన్‌పింగ్‌కు పుతిన్ తెలిపినట్లు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెలాఖరులో చైనాలో నిర్వహించే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు పుతిన్ హాజరుకానున్నారు.

# ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా పువ్వాడి జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 9)

పామూరు పట్టణంలో పామూరు మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లుకి ప్రత్యేకంగా కేక్ కట్ చేశారు. అనంతరం పూల మొక్కను బహూకరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, టీడీపీ నాయకులు నీరుకట్టు రసూల్, గాడి మహేంద్ర, ఆవుల నారాయణ, ఇండ్ల నరసింహారావు, షేక్ చాంద్ బాషా, వేముల జయ రాములు, పుప్పాల రాంమూర్తి, రవి, బ్రహ్మానాయుడు, ఇతర ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.







షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



# ఆర్మ్డ్ ఇన్‌స్పెక్టర్ డి సురేష్

ప్రకాశం జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగానికి బదిలీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)

పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగం నుండి ఆర్మ్డ్ ఇన్‌స్పెక్టర్ డి సురేష్ ప్రకాశం జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగానికి బదిలీ అయ్యారు. విభాగంలో రిపోర్ట్ చేసిన అనంతరం, శనివారం ప్రకాశం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూల కుండీ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి



## డిఆర్‌ఓ బి చిన ఓబులేసు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)

గిరిజన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు డిఆర్‌ఓ బి చిన ఓబులేసు చెప్పారు. శనివారం ఒంగోలులోని గిరిజన భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో డిఆర్‌ఓ తో పాటు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీనివాస ప్రసాద్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, గిరిజన వీరుల చిత్రపటాలకు వీరు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ గిరిజన హక్కులను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇటీవల పుల్లలచెరువు మండలం నరజాముల తండాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఆయా భూములపై హక్కులను నిర్ధారించేందుకు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. గిరిజన ఆవాస ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలను జిల్లా యంత్రాంగం తీసుకుంటున్నట్లు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్వశక్తితో (తరువాయి 4లో...)





# ఐఓసి రామతీర్థ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ కుమార్



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు 9) చీమకుర్తి బైపాస్ రోడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఐ.ఓ.సి. రామతీర్ధ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభ వేడుకలలో మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు, పారిశ్రామిక వేత్త, ఛాంబర్ అఫ్ కామర్స్, ఇండస్ట్రీ జోనల్ చైర్మన్, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామతీర్ధ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని కొండవీటి ఏడు కొండలు దంపతులు శిద్ధా రాఘవరావు, శిద్దా సుధీర్ కుమార్‌ని సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్ దినదినాభివృద్ధి చెంది వినియోగదారుల మన్ననలు పొందాలని వారు ఆకాంక్షిస్తూ రామతీర్ధ ఫిల్లింగ్ స్టేషన్ యజమానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకల సురేంద్ర, గ్రంధి శ్రీహరి, ఆలపాటి నరసింహ రావు, కొండవీటి వడ్డీ కాసులు, తదితరులు పాల్గొన్నారు.





# ఉద్యోగుల ఆర్థిక విషయాల పై ఉద్యమిస్తాం

## ఆపస్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)

ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక విషయాలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, ముఖ్యంగా 30 వేల కోట్లకు పైగా ఆర్థిక బకాయిలు విడుదల చేయడం, మూడు పెండింగ్ డి ఏ లు విడుదల చేయడం, పిఆర్సి కమిషన్ వేసి మధ్యంతర భృతి (ఐఆర్) 30% ప్రకటించడం వంటి ఆర్థిక విషయాలపై కార్యాచరణ రూపొందించి అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ పేర్కొన్నారు. నేడు ఒంగోలు పట్టణంలో ఏ కే వీ కే కళాశాల నందు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశం ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగులు నూతన ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని, ఒక సంవత్సరం పైగా అవుతున్నా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి ఆర్థిక ఆర్థిక విషయాలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం పై ఆందోళన వ్యక్తం చేస్తున్నామని, ఇకనైనా ప్రభుత్వం త్వరలో తీసుకుని ఉద్యోగులకు రావాల్సిన 30 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని, 12వ వేతన సవరణకు సంబంధించి వెంటనే సిట్టింగ్ జడ్జితో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, జూలై 2022 నుంచి వర్తించేలా 30% మధ్యంతర మృతి (ఐ ఆర్) ప్రకటించాలని, బకాయి పడ్డ ఐదు డి ఏ లను వెంటనే విడుదల చేయాలని,సిపిఎస్ రద్దు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు, హెల్త్ కార్డుల తో మెరుగైన వైద్యం వాటి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి అన్నారు. లేనిపక్షంలో త్వరలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలన్నింటినీ కలుపుకొని ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వారు హెచ్చరించారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలులో ఉన్న ఇబ్బందులను వెంటనే సరి చేసి ఎంఈఓ లు, డివైఈవోలు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపస్ సంఘటన కార్యదర్శి శ్రీ సిహెచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాపుల భారం తగ్గించాలని పదేపదే ఆందోళనలు వ్యక్తం చేస్తున్నా కూడా మరల ఆన్లైన్ వర్క్ పెంచి ఉపాధ్యాయులకు బోధన చేసే అవకాశం లేకుండా చేస్తున్నారని, ఇకనైనా బోధ నేతల పనుల నుండి విముక్తి కల్పించి బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఏబిఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన మంత్రి గుంత లక్ష్మణ్ జి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 అమలు చేసి ఐదు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా వికసిత భారత్ లక్ష్యంగా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని అందులో ఉపాధ్యాయులందరూ భాగస్వామ్యం అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో 26 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# గిరిజన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి





నిలబడేలా ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని, అవకాశాలను అందిపచ్చుకొని అన్ని రంగాలలోనూ గిరిజనులు ముందడుగు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలలో మెరుగైన మార్కులు సాధించిన ఇద్దరు గిరిజన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల చొప్పున గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బాలాజీ నాయక్ , డాక్టర్ లక్ష్మా నాయక్ లు ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించారు. ప్రతి ఏడాది ఇలాగే ఆర్థిక సహాయం చేసి ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన హక్కులు, సంక్షేమ సంఘాల నాయకులు పేరం సత్యం, యాకసిరి నాగరాజు, ఆర్. సైదా నాయక్ , కత్తి బుజ్జమ్మ, ఇండ్ల సుజాత, కే.సేవ్యా నాయక్ , చెవుల అంజయ్య, నిమ్మల ఈదన్న, బానావత్ వెంకటేష్ నాయక్, యాకసిరి జాలయ్య, ఎం.బాలు నాయక్, బి.మంతన్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.




## డాక్టర్ పోతరాజు శ్రీనాథ్ నూతన గృహప్రవేశ వేడుకలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుపాటి



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 9)**
ప్రముఖ ఎముకలు, కీళ్ళ వైద్య నిపుణులు డాక్టర్ పోతరాజు శ్రీనాథ్ నూతన గృహప్రవేశ వేడుక శనివారం జరిగింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని సత్యనారాయణస్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుకట్టు రసూల్, గద్దె సుధాకర్, గద్దె శేషు, గుర్రం వెంకటేశ్వర్లు, పిడుగు శ్రీనువాసులు, వాయినేని రాఘవ, పాలపర్తి రమణయ్య, గాడి మహేంద్ర, పుప్పాల రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాల ఘటనలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన ఎరిక్షన్ బాబు

**ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత**







**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, ఆగస్టు 9)**
పెద్ద దోర్నాల మండలం జమ్మిదోర్నాల గ్రామంలో ఈతకు వెళ్ళిన ఘటనలో విద్యార్థులు అద్భుత్ కుమార్, పవన్ ల మృతి విషయం తెలుసుకొని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల వద్ద వారి భౌతికకాయాలను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇరు కుటుంబాలకు చెరో 50,000 రూపాయల చొప్పున లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ దుర్ఘటన విషయాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంకు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ , రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డోలా బాల వీరాంజనేయ స్వామి మరియు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుండి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని ఎరిక్షన్ బాబు భరోసా అందించారు.

## ఏపీఆర్ఎస్ఏ డివిజన్ యూనిట్ ఏకగ్రీవ ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 9)**
కందుకూరు డివిజన్ ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల అధికారి అయిన కావలి తహసీల్దార్ పి. శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏపీ ఆర్ ఎస్ ఏ కందుకూరు డివిజన్ యూనిట్ ఎన్నికలను నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..ప్రెసిడెంట్ ఎస్ ఎస్ విజయ్ భాస్కర్, తహసీల్దారు, గుడ్లూరు మండలం.అసోసియేట్ ప్రెసిడెంట్ :పి. మధుసూదనరావు, డిప్యూటీ తహసీల్దార్, వలెటివారిపాలెం మండలంవైస్ ప్రెసిడెంట్–కె లక్ష్మి ప్రసన్న, డిప్యూటీ తహసీల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయం, కందుకూరు వైస్ ప్రెసిడెంట్–2 జె భార్గవి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, కందుకూరు మండలం వైస్ ప్రెసిడెంట్ 3 కె అంజలయ్య, సీనియర్ అసిస్టెంట్, గుడ్లురు మండలం జనరల్ సెక్రటరీ ఎంఎల్ఎన్ రాజు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, కందుకూరు మండలం జాయింట్ సెక్రటరీ 1 ఏ శ్రీకాంత్, ఆఫీస్ సబర్డినేట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, కందుకూరు జాయింట్ సెక్రటరీ 2 డి శ్రీదేవి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, లింగసముద్రం మండలం జాయింట్ సెక్రటరీ 3 ఎం హనుమాయమ్మ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, ఉలవపాడు మండలం ట్రెజరర్ ఎం రమణయ్య, సీనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, కందుకూరు ఎగ్జిక్యూటివ్ మెంబెర్ 1 టి శింగయ్య, జూనియర్ అసిస్టెంట్, వలేటివారిపాలెం మండలం ఎగ్జిక్యూటివ్ మెంబెర్ 2 జె సాయి తేజ, జూనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం, కందుకూరు ఎగ్జిక్యూటివ్ మెంబెర్ 3 సిహెచ్ ప్రభావతి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్, ఉలవపాడు మండలం డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ 1 సీహెచ్ శ్యామ్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, కొండాపురం మండలం డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ 2 కె కోటయ్య, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్, కందుకూరు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

## ఈశ్వరీదేవి మఠాధిపతికి ఘన స్వాగతం

**ఈశ్వరీదేవి అమ్మవారి పూజ మందిర పునర్నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం అందజేత**




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 8)**
వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఉన్న ఈశ్వరిదేవి అమ్మవారి మఠాధిపతులు శ్రీ శ్రీ వీర శివకుమార్ స్వాముల వారు శనివారం సాయంత్రం పొదిలికి విచ్చేశారు. ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారి పూజ మందిరం పున: నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగా భక్తుల నుండి రూ.60 లక్షలు జమ చేయాల్సి ఉంది. అందుకు గాను భక్తులకు అవగాహన కల్పిస్తూ ఈశ్వరిదేవి అమ్మ ప్రకాశం జిల్లాలో చాలా చోట్ల ప్రచారాలు కల్పించి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞాన తత్వాలను అందరికీ తెలియజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతల సహకారంతో ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.2.30 లక్షలను ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, కోశాధికారి రాచర్ల శేఖర్ కలిసి స్వామివారికి నగదును అందజేశారు. తొలుత స్వామి వారిని పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికారు.

## పలు శుభకార్యక్రమాల్లో ఎమ్మెల్యే కందుల





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఆగస్టు 9)**
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి శనివారం వివిధ శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. బోడపాడు గ్రామంలో జరిగిన బోరిగొర్ల వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కాపురం సౌజన్య ఫంక్షన్ హాల్లో జరిగిన దేవి రెడ్డి వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన గమ్ ట్రీ రెస్టారెంట్ , హొటల్ ను ప్రారంభించారు. మార్కాపురం పట్టణంలో వెంకచ్చమ్మ గుడి వద్ద జరిగిన కవలకుంట్ల వారి వివాహ మహోత్సవం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కాపురం పట్టణంలో దేవాలయం బజార్లో మంచి కంటి వారి నూతన గృహప్రవేశ మహోత్సవానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మార్కాపురం పట్టణంలో భగత్ సింగ్ కాలనీ లో జక్కా వారి నూతన గృహప్రవేశ మహోత్సవానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి. మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున, మాజీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం నుంచి బిజెపి కూటమి పార్టీలను తరిమికొట్టండి

## మాజీ కేంద్ర మంత్రి జె డి శీలం, జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ సైదా







**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఆగస్టు 9)**

చీమకుర్తి పట్టణంలోని జే,ఎం కన్వెన్షన్ సెంటర్ నందు సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా పసుమర్తి సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రణాళిక సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు గాంధీ నగర్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుండి జేఎం కన్వెన్షన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా పట్టణంలో ఏర్పాటుచేసిన జాతీయ, ప్రముఖ నాయకుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఈ ర్యాలీ కొనసాగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షుడు జరిగిన సభలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కేంద్ర మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారతదేశం నాశనం అయింది. రాజ్యాంగ సంస్థలను తమ స్వార్థానికి వాడుకుంటున్నాయి. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ సందేశాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలి. బీజేపీ ఏ విధంగా దొంగ ఓట్లతో ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వస్తుందో, రాజ్యాంగం ప్రజల ఓటు హక్కును హరించి వేస్తూ, ప్రజలను మోసం చేస్తుందో గ్రామ స్థాయి వరకు తెలియజేయాలన్నారు. ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ "స్వతంత్ర ఉద్యమంలో ఆగస్టు 8న గాంధీ క్విట్ ఇండియా పిలుపునిచ్చారు. అదే స్ఫూర్తితో బీజేపీనీ అధికార పీఠం మీద నుండి తరిమికొట్టాలి. ఈ నెల ఆఖరికల్లా మండల కమిటీలను పూర్తి చేయాలి అని నియోజకవర్గ సమన్వయకర్తలకు దిశా నిర్దేశం చేశారు. దేశ స్థాయిలో రాహుల్ గాంధీ, రాష్ట్ర స్థాయిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి ను స్ఫూర్తిగా నాయకులు పని చేయాలి అని, పార్టీ కోసం మనం ఏం చేస్తున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి" అని అన్నారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గ నూతన సమన్వయకర్త పసుమర్తి సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పట్ల బలమైన గొంతుకగా ఉంటాను అని అన్నారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా అన్నారు. ఇండియా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ,యర్రగొండపాలెం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ విజేష్ రాజ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఇంచార్జి గడ్డం పాల్ విజయ్ కుమార్, బాపట్ల డీసీసీ మాజీ అధ్యక్షులు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా అంజి బాబు, టి.వెంకటేశ్వర్లు, సంతనూతలపాడు ఎర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త పాలపర్తి విజేశ్ రాజ్, గిద్దలూరు సమన్వయకర్త పగడాల రంగ స్వామి, కనిగిరి సమన్వయకర్త సుబ్బా రెడ్డి, మన్నం ప్రసన్న రాజు, నట్టే సుబ్బారావు, తుమ్మల సుబ్బారావు, కొప్పుల శంకర్, వేల్పుల వెంకటేశ్వర్లు, ఇరిగినేని వెంకట నరసయ్య, గోరంట్ల కోటేశ్వరరావు, బొడ్డు సతీష్, మహమూద్ రఫీ అహ్మద్, షేక్ రెహానా భాను, సుధీర్ వర్మ, దుంపా యలమందా రెడ్డి ఎజ్రా, గురు బాబు, శంషీర్ అలీ, పిల్లి వెంకటేశ్వర రెడ్డి, పాలంకర్ రెడ్డి, వేల్పుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి పట్టణంలో కాంగ్రెస్ జెండాలతో ఫ్లెక్సీలతో పట్నాన్ని అందంగా అలంకరించారు దాదాపు రెండు కిలోమీటర్లు మేర పార్టీ పతాకాలంలో పాదయాత్ర నిర్వహిస్తూ తీన్మార్ డ్రమ్ములతో, బాలసంచా కాల్పులతో, డిజె సౌండ్ వందలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలతో సభ ర్యాలీ దిగ్విజయంగా జరిగింది.

# సమాజ అభివృద్ధికి శాస్త్రీయదృక్పథం అవసరం

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి







**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 9)**

గిద్దలూరు పట్టణంలో ఎస్ఎస్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన జన విజ్ఞాన వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. సమాజ అభివృద్ధికి శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరమని జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలో మాట్లాడుతూ మూఢనమ్మకాల వల్ల అనార్థాలను ఎదుర్కోవలసి వస్తుందని, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు పోతే అభివృద్ధి సాధించవచ్చునని పేర్కొన్నారు. విద్య ద్వారానే మూఢనమ్మకాలను నిరోధించే వీలు కలుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని, ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న జెవివి కమిటీ సభ్యులు, ప్రతినిధుల కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సుపరిచతులు అయినా జెవివి నాయకులు స్వరూప రెడ్డి కృషి ని కొనియాడారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలుగా విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని, సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ప్రతి ఏటా ఉన్నత పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల మంది విద్యార్థులు చెకుముకి ప్రతిభా పరీక్షలు రాశారన్నారు. సైన్స్ సంబరాలు నాలుగు స్థాయిలలో నిర్వహిస్తున్నామని అన్నారు.జెవివి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి మురళీధర్ మాట్లాడుతూ సైన్స్ శాస్త్ర దృక్పథాన్ని ముందుకు తీసుకుపోవడానికి యువత, మహిళలు విద్యావంతులు ముందుకు రావాలని కోరారు. జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ టి చెన్నకృష్ణ తల్లీ-బిడ్డల ఆరోగ్యం, తల్లిపాలు ప్రాధాన్యత గురించి అవగాహన కలిగించారు. గిద్దలూరు ఏఎంసీ చైర్మన్ బైలడుగుల బాలయ్య యాదవ్ , వైస్ చైర్మన్ గొడి ఓబుల్‌రెడ్డి, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూప రెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు ఝాన్సీ పాల్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యు భాస్కర్, వి మాలకొండారెడ్డి, జెవివి జిల్లా గౌరవ సలహాదారులు కె సుబ్రహ్మణ్యం, జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం శ్రీనివాసులు,సి.హెచ్. జయప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి, ఖజాహుస్సేన్, యు.వెంట్రావు, నల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ. విశ్వరూపం,జి. శ్రీనివాసరెడ్డి వెంకటేష్ ఎస్ఎండి రఫీ, పలు మండలాల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవతో గుంటూరు బ్రిడ్జికి మోక్షం

## రూ.92 కోట్లు మంజూరు

**(షణ్ముఖ వెలుగు, గుంటూరు, ఆగస్టు 8)**






ఎన్నో సంవత్సరాల నుంచి బ్రిడ్జి పనులు చేస్తామని చెప్పిన నాయకులు ఎందరో మారిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బ్రిడ్జిని తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ నూతన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టేందుకు రూ.92 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో శనివారం శంకర్ విలాస్ బ్రిడ్జి ని కూలగొట్టారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కేంద్రమంత్రి పెమ్మసాని మొక్కవోని దీక్షతో నూతన ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన నిధులు రాబట్టడంలో సఫలీకృతులయ్యారు. ఈ నూతన ఫ్లైఓవర్ నిర్మాణం స్థానిక ఉమెన్స్ కాలేజీ రోడ్డు నుంచి అరండల్ పేట 10 వ లైను వరకు నిర్మించడం జరుగుతుందన్నారు. త్వరలోనే నూతన ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

# బీఆర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో ఆకర్షణీయంగా "రక్షా బంధన్" వేడుకలు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 9)**

కందుకూరు పట్టణంలోని స్థానిక పామూరు రోడ్ నందు బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో శనివారం " రక్షాబంధన్ " వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీ కట్టి వారి క్షేమాన్ని కోరగా బాలురు సంతోషంతో తగిన బహుమానాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ.. భారతీయ సనాతన ధర్మంలో అన్నలు ఎపుడూ చెల్లెళ్ళకు రక్షణ గా ఉండి వారిని జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుతారని తెలిపారు.విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాల భాస్కర రావు మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులందరూ అక్కా తమ్ముళ్లుగా, అన్నా చెల్లెళ్లు గా స్నేహభావంతో మరియు సోదర భావం తో మెలగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్రబాబు,పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, తదితరు ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# పెరిదేపి గ్రామ శివార్లలో దుర్వాసన చెత్తా, చెదారంతో నిండిపోయిన రహదారి

## వాహనదారులకు ఇబ్బందిగా మారిన వైనం





**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 9)**

కొండపి మండలం పెరిదేపి గ్రామపంచాయతీ పరిధిలోని ఒంగోలు నుంచి పొదిలి వెళ్లే ఆర్ఎంబి ప్రధాన రహదారికీ పెరిదేపి గ్రామ శివారులలో రోడ్డు ఆనుకొని చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది నిత్యం ఒంగోలుకి వేలాది మంది ఇటు ప్రయాణిస్తూ ఉంటారు కొండేపి నుంచి ఒంగోలు వెళ్లే క్రమంలో పెరిదీపి గ్రామం వస్తూ ఉందనంగా వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుకి ఇరువైపులా చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఇకనైనా పెరిదేపి గ్రామపంచాయతీ అధికారులు రోడ్డు కిరువైపులా ఉన్న చెత్తను తొలగించాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

# మాలకొండకు రూ.13,85,947 ఆదాయం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 9)
వలేటివారిపాలెం మండల పరిధిలోని మాలకొండ పుణ్యక్షేత్రంలో శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల ద్వారా వివిధ రూపాల్లో ఆలయానికి ఆదాయం రూ. 13,85,947 సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్టోత్తరం ద్వారా రూ.9350 కుంకుమార్చన ద్వారా రూ.24,2,00 భక్తులు వివాహములు ద్వారా రూ .44,000సమర్పించిన తలనీలాల ద్వారా రూ.55,200వాహనపూజలు ద్వారా రూ.6,220 ప్రత్యేక దర్శనాలు ద్వారా రూ.5,05,200స్థల పురాణం ద్వారా రూ.960 రూము అద్దెలు ద్వారా రూ.35,200 కవర్లు ద్వారా రూ.17,000 లడ్డు ప్రసాదం ద్వారా రూ.3,71,345 అన్నదానం ద్వారా రూ.2,49,772 విరాళములు రూ.67,500 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

# తోబుట్టువుల మధ్య సంబంధాన్ని తెలిపే అపూర్వ పండుగ రక్షాబంధన్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)
రక్షా బంధన్ అనేది తోబుట్టువుల మధ్య సంబంధాన్ని ప్రేమ, బాధ్యత , గౌరవాన్ని పెంపొందించే అపూర్వ పండుగ. శనివారం సోదరీమణులు హారతి ఇచ్చి, తిలకం పెట్టి, "రాఖీ" అని పిలువబడే పవిత్ర దారాన్ని తమ సోదరుడి మణికట్టుకు కడతారు. సోదరీమణులు తమ సోదరుడి శ్రేయస్సు, దీర్ఘాయువు కోసం, పూజ చేస్తారు. షణ్ముఖ వెలుగు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఉబ్బా అశోక్ బాబు తన కుటుంబ సభ్యులతో రాఖీ పండుగ నిర్వహించుకున్నారు.







# మండలి వెంకటకృష్ణరావు శతజయంతి ఉత్సవాల సభలో పాటి రత్నాలు పుస్తకం ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)
ప్రముఖ సాహితీవేత్త యువి రత్నం రచించిన "పాటి రత్నాలు" అనే కవితా సంకలనాన్ని మండలి బుద్ధ ప్రసాద్ శతజయంతి ఉత్సవాలు సభలో భాగంగా మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వి రమణకి మండలి వెంకట కృష్ణారావు అవార్డు అందించేందుకు జరుగుతున్న సభలో ఆ పుస్తకాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చేతులమీదుగా ఆవిష్కరణ జరిగింది.ఈ సభలో ఈ పుస్తకం గురించి తేళ్ల అరుణ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, పితాని సత్యనారాయణ ఎమ్మెల్సీ నెట్టెం రఘురామ ప్రసాద్ ,విల్సన్ ,గుమ్మడి గోపాలకృష్ణ,డాక్టర్ జి వి పూర్ణచంద్, డాక్టర్ నూనె అంకమ్మరావు, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యు వి రత్నంని పలువురు అభినందించారు.

# వాహనదారులు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి ఎస్ఐ మాధవరావు



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఆగస్టు 9)
మండలంలోని ప్రతి వాహన వాహనదారుడు వాహనం నడిపే సమయంలో అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు అన్నారు. హనుమంతునిపాడు మండలంలోని వేములపాడు రహదారిలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలను ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సరియైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

# ట్రాలీ, తుఫాన్ వాహనం ఢీ ఐదుగురు దుర్మరణం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 9)
చాగోల్లు జాతీయ రహదారిపై ఐరన్ ట్రాలీ ని ఢీ కొట్టిన తుఫాన్ వాహనం ఐదుగురు దుర్మరణం వివరాల్లోకి వెళితే ఉలవపాడు మండలం చాగొల్లు ఎన్ హెచ్ 16 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో 12 మంది ప్రయాణికులు ఉన్న ఒక తుఫాను వాహనం పల్నాడు జిల్లా మాచవరం మండలంలోని కోత గణేశుని పాడు గ్రామం నుండి బయలుదేరింది. ఉలవపాడు మండలం చాగొల్లు దాటిన తర్వాత తుఫాను వాహన డ్రైవరు లారీని దాటుతుండగా తుఫాన్ వాహనం ముందు ఎడమవైపు ముందు కదులుతున్న లారీ కుడి వెనుకవైపు బంపర్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తుఫాన్ వాహనం ముందు ఎడమచక్రం విడిపోయి వాహనం బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా, ఒక బిడ్డ మృతి చెందింది. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి అంబులెన్స్ నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించుకుండగా మార్గమధ్యంలో వారు మరణించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. కే అంకమ్మ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసి ప్రయాణికులందరినీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. మృతులు నంబుల వెంకట నరసమ్మ (55), సుభాషిని (3), అభిరామ్ (3), నంబుల రుక్మిణి (5), ఎర్రం శ్రీనివాసరావు (60) సంవత్సరాలుగా గుర్తించారు.







# దేవిరెడ్డి వారి వివాహ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు అన్నా కుందురు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 9)
పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్ నందు దేవిరెడ్డి నారాయణరెడ్డి, లక్ష్మిదేవిల కుమారుడు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులు నిరంజన్‌రెడ్డి, చైతన్య లక్ష్మీను గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు ఇంచార్జి కుందురు నాగార్జునరెడ్డి ఆశీర్వదించారు.
వారి వెంట తదితర నాయకులు పాల్గొన్నారు.



# శ్రీగిరి నిలయునికి పవిత్రాల సమర్పణ

### శోభాయమానంగా విశేష స్నపన తిరుమంజనం

### కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)
శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీగిరి నిలయునికి కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారికి.. దేవతామూర్తులకు పవిత్రాలను సమర్పించారు. ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో హెూమ కార్యక్రమాలతో పాటు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం ఏకాంత సేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అంద చేసారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర





అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉక్త హెూమం,పూర్ణాహుతి కార్యక్రమాలతో శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ముగుస్తాయి.



# రాఖీ పౌర్ణమి వేడుకల్లో బెల్లంకొండ విజయలక్ష్మి





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 9)
రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని బీజేపీ నాయకులు, కుటుంబ సభ్యులు, దేశం కోసం సేవలందించిన మాజీ ఆర్మీ సోదరులు, ముస్లిం సోదరులతో కలిసి బెల్లంకొండ విజయలక్ష్మి స్నేహసూచకమైన రాఖీ కట్టి సోదర,సోదరీమణుల బంధాన్ని మరింత బలపరిచారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ఆర్మీ సైనికులు ఎం.హాసన్ అలీ, మహబూబ్, అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎస్డీ ఖాదర్ బాషా, ఎస్కే రఫీ, పువ్వాడ నారాయణ, యుద్ధం మహేష్, భార్గవ్ నాయుడు తదితరులు పాల్గొని రాఖీ పండుగను సాంప్రదాయబద్ధంగా, సంతోషభరితంగా జరుపుకున్నారు. బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ "రాఖీ పండుగ కేవలం సోదర,సోదరీమణుల మధ్య బంధానికి మాత్రమే కాకుండా, సమాజంలో ఐక్యత, పరస్పర విశ్వాసానికి సంకేతం. దేశం కోసం పోరాడిన సైనికులకు రాఖీ కట్టడం నాకు గర్వకారణం" అని పేర్కొన్నారు. పండుగ సందడితో పొదిలి మండలంలో స్నేహం, సోదరభావం పరిమళించింది.



# సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఆగస్టు 9)
ఈ నెల 20 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య తెలిపారు. పుల్లలచెరువు మండల కేంద్రంలో మండల కార్యదర్శి గురునాథం ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు సిపిఐ జాతర బృందం బస్సుయాత్ర,కోలాటంతో రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజా నాట్యమండలి ఆట పాటల ద్వారా నిర్వహించిన ప్రచార జాత ప్రజలను ఆకట్టుకుంది. ప్రజలు పాల్గొని బస్సు యాత్రకు బ్రహ్మరథం పట్టారు. పలు విప్లవ పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఒంగోలులో జరుగు రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ పాటలు కళాకారులు ప్రదర్శించారు. అలాగే బస్టాండ్ ఆవరణంలో పాడుకుంటూ ప్రజా నాట్యమండలి వారు కళాజాత బృందం చే ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడే పార్టీ సిపిఐ పార్టీ అని, నిరంతరం ప్రజల కోసం కష్టపడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని పేర్కొన్నారు. కనుక ఈ నెల 20వ తేదీ నుండి ఒంగోలు జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి తిరుమలయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజర్ ఆర్ రామకృష్ణ, పుల్లలచెరువు మండల కార్యదర్శి గురునాథం, గుంటూరు శ్రీను, కనకాచారి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి శివయ్య, దప్పు శీను, లక్ష్మి, విజయ,నారాయణమ్మ, చింతలచెరువు రాములు, వేల్చూరు బాలయ్య, గొడుగు బ్రహ్మయ్య, ఆటో యూనియన్ కార్మికులు, పారిశుద్ధ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# వాహనాల్లో ప్రయాణించే పిల్లల భద్రత పై పార్లమెంటులో ప్రశ్నించిన ఎంపి మాగుంట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 9)
దేశం , ఆంధ్రప్రదేశ్ లో వాహనాల్లో ప్రయాణించే పిల్లల భద్రతపై సర్వే, రోడ్డు ప్రమాదాలు ,మరణాలు, చట్టాలు ,మార్గదర్శకాలు, నిబంధనల అతిక్రమణ, ఆధునిక ప్రమాణాలపై ప్రభుత్వ చర్యల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులు శాఖ మంత్రి, నితిన్ జైరాం గడ్కరి సమాధానమిస్తూ ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల వివరాలను రాష్ట్రాలనుండి కేంద్రం సేకరిస్తుందని, దేశం మొత్తంలో 2018 లో 9,857 మంది, 2019 లో 10,950 మంది, 2020 లో 7,117 మంది, 2021 లో 7,764 మంది, 2022 లో 9,528 మంది 18 సంవత్సరాల లోపు పిల్లలు రోడ్డు ప్రమాదాలలో చనిపోగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరుసగా 330, 414, 412, 381 , 474 మంది పిల్లలు చనిపోయారని తెలిపారు. భద్రతా బెల్టు ,నియంత్రణ వ్యవస్థ లేకుండా 14 సం.లు వయస్సు నిండని పిల్లలతో వాహనాన్ని నడిపే లేక నడపడానికి అనుమతించే వ్యక్తికి రూ.1,000లు జరిమానా విధించే నిభందన మోటార్ వేహికల్స్ చట్టం 1988 కలిగి వున్నదని తెలిపారు. సెంట్రల్ మోటార్ వెహికల్స్ చట్టం 1989 నిభందన ప్రకారం, వాహనాలలో పిల్లల కూర్చునే స్థానాలలో కనీసం ఒక నియంత్రణ వ్యవస్థ తప్పక ఏర్పాటుచేయాలని తెలిపారు. రెండు చక్రాల వాహనాలపై వెనక సీటులో ప్రయాణించే 4 సం.ల పిల్లల భద్రత కోసం కవచం, ప్రమాద శిరస్త్రాణం తప్పక ఉపయోగించాలని రోడ్డు రవాణా , జాతీయ రహదారులు శాఖ అదేశాలు ఇచ్చిందన్నారు. అన్ని చట్ట నిబందలను రాష్ట్రాలు అమలుచేస్తాయని కేంద్ర మంత్రి తెలిపారు.

# పట్టణ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి మానుగుంట



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 9)

రాఖీ పండుగ సందర్భంగా రాష్ట్రంలో ప్రతి ఒక్క అక్క చెల్లెమ్మలకు.. ప్రతి ఒక్క పాపకు, ప్రతి ఒక్క మహిళకు మాజీ మంత్రి మానుగుంట మహిధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షాబంధనం అన్నది ఆత్మీయతలు, అనురాగాల పండుగ అని.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, రక్షణపరంగా.. మహిళలకు ఎప్పుడూ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరి దేవుడి ఆశీస్సులు, చల్లని దీవెనలు ఎల్లకాలం లభించాలని కోరుకుంటూ.శనివారం కులమతాలకు అతీతంగా మహీధర్‌రెడ్డి కందుకూరు తన కార్యాలయంలో ముస్లిం పిల్లలు, మహిళలు వచ్చి రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

# ట్రాక్టర్‌ను తగుల బెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, ఆగస్టు 9)

మండలంలోని శతకొడు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ ను తగలబెట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు శతకొడు గ్రామానికి దగ్గరలో ఉన్న పామాయిల్ తోటలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.గంగవరపు సాంబులు చిన్న నారాయణరెడ్డి ఈ రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.వివిధ కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని,ఇటువంటి చర్యలకు పాల్పడిన వారు ఎవరైనా వదిలిపెట్టేది లేదన్నారు.

# సిపిఐ రాష్ట్ర 28వ మహాసభలను విజయవంతం చేయండి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 9)

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర మహాసభలు ఈ నెల 20 నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తున్నందున కనిగిరి పట్టణంలో గార్ల పేట రోడ్డు ,ఎమ్మెస్సార్ రోడ్డు, కొట్లబజార్, మహాలక్ష్మమ్మ చెట్టు బజార్, రామాలయం వీధి, వైయస్సార్ రోడ్డు, తీగల గొంది తిరుగుతూ పాంప్లెట్లు పంచుతూ రాష్ట్ర మహాసభల నిధిని సేకరిస్తూ ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిపిఐ నాయకులు నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాల్రెడ్డి, మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, ఏఐటీయూసీ నాయకులు కాసిం పీరా మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలో ఘనంగా నిర్వహిస్తున్నందున ఈ నెల 23వ తేదీ 30 వేల మందితో భారీ ర్యాలీ బహిరంగ సభ ఉంటుందని వేలాదిగా తరలివచ్చి సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్. మస్తాన్, శివం యస్ దాని మండల కార్యదర్శి ఇఫ్రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శులుగా మారి బంగారు కుటుంబాలకు చేయూత అందిద్దాం

## మున్సిపల్ కమిషనర్ పిలుపు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 9)

బంగారు కుటుంబాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మార్గదర్శులుగా ముందుకు రావాలని కనిగిరి మునిసిపల్ కమీషనర్ పి. కృష్ణ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మునిసిపల్ కమీషనర్ మార్గదర్శిగా కాశిరెడ్డి కాలనీలో బంగారు కుటుంబమైన వేటగిరి అంకమ్మ కుటుంబ సభ్యులను సందర్శించి స్నేహపూర్వకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, 'పీ4 జీరో పావర్టీ స్కీమ్ ు ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, ప్రతి జీవితానికి నూతన ఆశ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మనం అందరం కలిసి బంగారు కుటుంబాలకు చేయూత అందించాలని పేర్కొన్నారు. వారి అవసరాలను తెలుసుకుని, పిల్లాడికి బట్టలు కొనుగోలుకు రూ.4,000, సరుకులు మరియు కూరగాయల కోసం రూ.2,000 మొత్తం రూ.6,000 విలువైన సహాయాన్ని అందించానని తెలిపారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా బుర్రాకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళా నాయకురాళ్లు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 9)

అన్న చెల్లెల అనుబంధానికి, ప్రేమకు తార్కానమైన రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు మహిళా నాయకురాలు రాఖీ కట్టి శుభాకాంక్షలను తెలిపారు. ముందుగా తిలకం దిద్ది హారతి ఇచ్చి రక్షాబంధన్ కట్టారు. మహిళా నాయకురాళ్లను ఆశీర్వదిస్తూ బుర్రా మధుసూదన్ యాదవ్ బహుమతి ఇచ్చి ఆశీర్వచనాలను అందించారు. రక్షాబంధన్ కట్టిన వారిలో పట్టణ మహిళా అధ్యక్షురాలు వసంత, అంగన్వాడి నియోజకవర్గ అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి, ముస్లిం నాయకురాలు, తదితరులు ఉన్నారు.

# శివారు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

## సమస్యల పరిష్కారానికి చర్యలు

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 9)

శివారు ప్రాంతాల అభివృద్ధే ముఖ్య ధ్యేయమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా శనివారం కాశిరెడ్డి కాలనీలోని కొండ క్రింద నివసించే పాముల కాలనీ ప్రాంతంలో ఆయన పర్యటించారు.అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడి వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ శివారు ప్రాంతలో సుమారు 30 కుటుంబాలు దాదాపు 10 సంవత్సరం నుండి ఆ ప్రాంతంలో నివసిస్తున్నామని నీటి వసతి,విద్యుత్ వసతి లేకా చాలా బాధపడుతున్నామని గుడిసెలు వేసుకొని నివసించే ప్రాంతంలోనే వారికి రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని ఉద్దేశంతో వారు లిఖిత పూర్వకముగా సమస్యలు చైర్మన్ దృష్టికి తేగా త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com